క్లుప్తంగా

సీఆర్‌ఆర్‌లో రోటరాక్ట్ క్లబ్ ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో రోటరాక్ట్ క్లబ్ ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ పి.శైలజ తెలిపారు. రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం, సేవ వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో రోటరీక్లబ్ విద్యార్థి విభాగాన్ని తమ కళాశాలలో రోటరాక్ట్ క్లబ్‌గా ప్రారంభించామని పేర్కొన్నారు. రోటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ యామిని, కార్యదర్శిగా సీహెచ్ సౌమ్యలను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అనురాధ, ఐక్యూసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

మాజీ గ్రామాధికారుల హర్షం

ఏలూరు రూరల్: మాజీ గ్రామాధికారులకు తెల్లకార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంపై మాజీ విలేజ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల వెంకట సుబ్బారావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మాజీ గ్రామాధికారులు నెలకు రూ 4 వేలు పెన్షన్ పొందుతుండడ వల్ల గత ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డులు రద్దు చేసిందని గుర్తు చేశారు. నేడు సీఎం జగన్ జారీ చేసిన ఉత్తర్వుల ఫలితంగా ఏడాదికి పెన్షన్ పొందుతున్న సంఘ సభ్యులు 48 వేల మంది తెల్లరేషన్‌కార్డులు పొందవచ్చన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కార్డు కోసం దరకాస్తు చేసుకోవాలని సభ్యులకు సూచించారు.

నేతాజీగూడెంలో పారిశుధ్య పనులు



నేతాజీగూడెంలో శానిటరీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్ నేతాజీగూడెంలో పారిశుధ్య పనులను డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు పరిశీలించారు. నేతాజీగూడెంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చుతూ మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. కార్పొరేషన్ శానిటరీ వర్కర్లతో డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. మురుగునీటి పారుదలకు అడ్డు లేకుండా, చెత్తా వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. దోమలు ప్రబలకుండా డ్రెయినేజీలను క్లీన్ చేయించారు.

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం



జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను సత్కరించిన శ్రీలక్ష్మి



పారిశ్రామిక వేత్త వంక రవీంద్ర దంపతులను సత్కరిస్తున్న శ్రీలక్ష్మి

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: రాష్ట్రంలో సామాజిక విప్లవానికి శ్రీకారం చుడుతూ దశాబ్దాలుగా అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలుస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా అండగా నిలుస్తారని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసేందుకు ఏలూరు వచ్చిన పార్టీ నేతలను ఆమె ఘనంగా సత్కరించి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరఫున నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్, బీసీ నేత కవురు శ్రీనివాస్‌ను, తణుకు ప్రాంతానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్‌సీపీ నేత వంక రవీంద్రనాథ్, ఆయన సతీమణి రాజకుమారిలకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని పాలించిన వారంతా బీసీలను ఓటు బ్యాంకు గానే చూస్తే సీఎం జగనన్న మాత్రమే బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్నారని వివరించారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో ఏకంగా 11 బీసీలకే కేటాయించి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని తెలిపారు. పార్టీ పట్ల విధేయత, నిబద్ధత గల నాయకులు వంక రవీంద్రకు సముచిత స్థానం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు. రాబోయే కాలంలో బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలన్నీ సీఎం జగనన్నకు తోడుగా ఉండాలని, ఆయనతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు.

సివిల్ జడ్జి భావనకు ఘన సత్కారం



జడ్జి భావనను గజమాలతో సత్కరిస్తున్న న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ నుంచి సివిల్ జడ్జిగా ఎన్నికైన పి.భావనను ఆదర్శంగా తీసుకోవాలని న్యాయవాది, దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు కోరారు. స్థానిక లంకపేట కార్యాలయంలో దళిత జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆమెను ఘనంగా సత్కరించారు. భావన ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిల నియామకాల్లో పెద్దాపురం జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులవడం అభినందనీయమని పెరికే అన్నారు. జూనియన్ లాయర్లకు సీఎం వైఎస్ జగన్ లా నేస్తం పథకం ద్వారా నెలకు రూ.5 వేలు అందించడం హర్షణీయమన్నారు. జూనియర్ లాయర్లకు ప్రాక్టీస్ సరిగా లేని సమయంలో ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం తోడ్పడుతుందని తెలిపారు. వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని వరుసగా నాలుగోసారి రాష్ట్ర వ్యాప్తంగా 2,011 మంది జూనియర్ లాయర్లకు అందించడం అభినందనీయమన్నారు. న్యాయవాదులకు రూ.100 కోట్లతో అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్టు పెట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పచ్చిగళ్ల వెంకటరత్నం, బి.రామకృష్ణ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయానిదే అంతిమ విజయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): న్యాయానిదే అంతిమ విజయమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకుడు షేక్ మస్తాన్ పేర్కొన్నారు. ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించినా బీజేపీ అడ్డదారిన మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి పన్నిన కుట్రలన్నీ భగ్నమయ్యాయని తెలిపారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్నికల లెక్కింపులో మేయర్‌గా ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకురాలు షెల్లీ ఒబెరాయ్ గెలుపొందడంతో బీజేపీ ఎత్తులు చిత్తయ్యాయని పేర్కొన్నారు. ఒబెరాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సురక్షిత తాగునీరు అందించండి

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల ప్రజలకు తక్షణం సురక్షిత తాగునీరు అందించాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఏలూరు మండలం గుడివాకలంక, కొక్కిరాయిలంక గ్రామాల పెద్దలు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి తాగునీటి సమస్యపై చర్చించారు. గుడివాకలంక మాజీ సర్పంచ్ జయమంగళ రామారావు మాట్లాడుతూ మొండికోడు రిజర్వాయర్ నుంచి అందిస్తున్న తాగునీరు పూర్తిస్థాయిలో ఫిల్టర్ కావడం లేదన్నారు. రిజర్వాయర్ నుంచి పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదని కొక్కిరాయిలంక పెద్దలు వివరించారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరాజు రిజార్వాయర్ వద్ద శుద్ధి చేస్తున్న తాగునీటి నాణ్యత పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఫోన్‌లో కోరారు.రానున్న ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు.

సమాన ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలి



ఎమ్మెల్సీ జూపూడి, లిడ్ క్యాప్ చైర్మన్ రాజశేఖర్‌లను సత్కరిస్తున్న బీఎస్‌ఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): వెనుకబడిన వర్గాలకు చెందిన బహుజనులకు అన్ని రంగాలలో సామాజిక న్యాయం జరిగే లా చూడాలని బహుజన సేన సమితి నాయకులు ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్‌లను కోరారు. బుధవారం ఏలూరు విచ్చేసిన వారిని బహుజన సేన సమితి నాయకులు కలిసి దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలకు విద్య, ఉద్యోగ రంగాలలో సంక్షేమ పథకాలు అమలులో సమాన ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్‌ఎస్ అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్, ఏలూరు జిల్లా కార్యదర్శి లక్కపాము చంటి, శికాకోలు స్టాలిన్,గుంటూరు నవీన్, పంతం కిషోర్, తరగం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తపస్సుకాల దీక్ష ప్రారంభం



తపస్సుకాల ప్రార్థనలను ప్రారంభిస్తున్న బిషప్ పొలిమేర జయరావు, గురువులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): క్రైస్తవులు ఏటా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే 40 రోజుల ఉపవాస ప్రార్థనల కాలం బుధవారం ప్రారంభమైంది. స్థానిక గ్జేవియర్ నగర్‌లో అమలోద్భవి కథిడ్రల్ ఆలయంలో బుధవారం ఉదయం 6.30 గంటలకు ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, పలువురు గురువులు పూజ సమర్పించారు. తపస్సు కాలంలో క్రైస్తవులంతా ఉపవాసాలు, ప్రార్థనలు, పేదసాదలకు సాయం చేస్తూ జీవించాలని, వివిధ పాప కార్యాలకు దూరంగా ఉంటూ పవిత్రంగా జీవితం గడపాలని బిషప్ జయరావు హితవు పలికారు. విచారణ గురువు ఫాదర్ మైఖేల్ ఇంజమాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40 మంది స్త్రీ, పురుషులు దీక్షా వస్త్రాలు ధరించి దీక్ష స్వీకరించారు. వారికి పీఠాధిపతి, గురువులు నుదిటిపై విభూది పెట్టి దీవించారు. కార్యక్రమంలో ఫాదర్లు బాలజోజి, కె.జోజి బాబు, స్టీవెన్ థామస్, ఎన్.స్టీఫెన్, డి.అబ్రహాం, ఎం.నిర్మల, జె.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలపై అవగాహన



కృత్రిమ అవయవాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న డీడీఆర్‌సీ సిబ్బంది

ఏలూరు రూరల్ : ప్రభుత్వం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తోందని ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు అన్నారు. బుధవారం జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డీడీఆర్‌సీ) సౌజన్యంతో ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏలూరు మండలం మల్కాపురం సచివాలయంలో కృత్రిమ అవయవాల ఉపయోగం, సేవలపై అవగాహన కల్పించారు. కృత్రిమ అవయవాల వల్ల దివ్యాంగులు మరింత మెరుగైన జీవితాన్ని పొందవచ్చని రాంబాబు వివరించారు. ఇందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ, సహకారం అందిస్తోందన్నారు. చిన్న పిల్లలకు ఉన్న వయసులోనే స్పీచ్ థెరిఫీ, ఫిజియోథెరిపీతో పాటు మానసిక దివ్యాంగులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సుమలత మాట్లాడుతూ డీడీఆర్‌సీ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ అందుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రుష్మిత, జయలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దైవ సేవకుల సమస్యల పరిష్కారానికి కృషి



ఏలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): దైవ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ అన్నారు. ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో బుధవారం నిర్వహించిన దేవసేవకుల సదస్సు, గ్రాడ్యుయేట్ సెర్మనీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ ద్వారా ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన మతాన్ని ఎంచుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా స్థానిక భోగాపురంలోని ఈస్ట్ కోస్ట్ బైబిల్ కాలేజీ ద్వారా నూతన దైవ సేవకులకు గ్రాడ్యుయేట్ పట్టాలు అందించారు. విన్ అవర్ నేటివ్స్ డైరెక్టర్ పాస్టర్ పి.జీవన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య వర్తమానికులు డాక్టర్ జేమ్స్ చాకో,డాక్టర్ వైయస్ థామస్ రెడ్డి, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, దళిత క్రిస్టియన్ రైట్స్ అధ్యక్షుడు పెరికే వరప్రసాద్, డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్ బాబు, కోఆప్షన్ సభ్యులు జాన్ గురునాథ్, ఆళ్ల సతీష్ చౌదరి, మేతర అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారామ కల్యాణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సామూహిక సీతారామ కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు కైకలూరుకు చెందిన భగవద్గీత ప్రచారకులు ఘంటసాల బసవయ్య దశావతార ప్రవచనాలు చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు, నిత్య హోమం, స్వామి వారికి నిత్య కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	34
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12-15
బెండకాయలు	48	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-36	కీరా దోస	30
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	58	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	36	పాలకూర	08
దొండకాయలు	32	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	40-48	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	29
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

తలసేమియా చిన్నారులకు అండగా ఉందాం



రక్తమార్పిడి చికిత్స అందిస్తూ చిన్నారితో రెడ్‌క్రాస్ కార్యదర్శి బెన్ని, డాక్టర్ వరప్రసాదరావు

ఏలూరు టౌన్: స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ తలసేమియా చిన్నారులకు ఉందామని రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్ని తెలిపారు. ఏలూరు ప్రభుత్వ బోధనా సుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం పలువురు తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స అందించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలుస్తుందని బెన్ని చెప్పారు. చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు, సహాయకులు 20 మందికి డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది, చిన్నారులు ఉన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి ఏలూరుకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళం అందజేశారు. చల్లా సాయి సునీల్‌రెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు వెంకటరామరెడ్డి, వాణిశ్రీల పేరిట విరాళం ఇచ్చారు.

జన్మ నక్షత్ర పూజలు

పెదపాడు: అప్పనవీడు అభయాంజనేయునికి స్వామి వారి జన్మనక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు.

ఖండన ప్రకటన (లీగల్)

25-01-2023 తేదీన సాక్షి దినపత్రిక నందు కెనరా బ్యాంక్, స్పెషలైజ్ (ఎస్.ఎం.ఇ.బ్రాంచి) ఏలూరు (పూర్వపు సిండికేట్ బ్యాంక్) వారు జారీచేసిన ... వేలం ప్రకటనకు మా క్లయింటు అయిన శ్రీమతి ... శ్రీనివాసరావు, డి.నెం.5-118, మాదేపల్లి గ్రామం, ఏలూరు వారి ఉత్తర్వులను అనుసరించి జారీచేసిన ఖండన ప్రకటన :- [illegible]

ఆస్తి వివరం : ఏలూరు మండలం, ఏలూరు ఎస్ఆర్ఓ, మాదేపల్లి పంచాయితీ మరియు గ్రామం ఆర్.ఎస్.నెం.88/3 నందు గల 188 చతురపు గజముల స్థలములో డి.నెం.5-113 గల ఆర్‌సిసి డాబా బిల్డింగునకు హద్దులు : తూర్పు : పంచాయితీ రోడ్డు, దక్షిణం : [illegible], పడమర : [illegible], ఉత్తరం : [illegible]

సం/- కూరపాటి పృథ్వీరాజ్, కందుల సత్యవాణి
న్యాయవాదులు, ఏలూరు, సెల్ : 80188 26216

ఆశ్రయం సంస్థకు కొమిరేపల్లిలో గృహ నిర్మాణ బాధ్యత





కొమిరేపల్లిలో జగనన్న లేఅవుట్లలోని ఇళ్లు, (అంతర చిత్రం) దాత అరుణ్‌భవాని

దెందులూరు : కొత్తగూడెం పంచాయతీ కొమిరేపల్లిలో జగనన్న లేఅవుట్‌ను ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రయం దత్తత తీసుకుంది. సింగవరంలోని 14 మంది గిరిజనులకు కొమరేపల్లి జగనన్న లేఅవుట్‌లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇళ్ల స్థలాలను మంజూరు చేశారు. పూరి గుడిసెల్లో ఉండే గిరిజనులు ఇళ్లు కట్టుకోలేని పరిస్థితిని తెలుసుకున్న సీఎంఓ కార్యాలయం చొరవ సమన్వయంతో ఆశ్ర యం ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కొత్తగూడెం గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. 14 మంది గిరిజనుల కుటుంబాలకు 40 బీసీ, ఇతరులకు ఇళ్లు కట్టి ఇచ్చేందుకు సీఎంఓ కార్యాలయానికి ఆశ్రయం సంస్థ అంగీకారాన్ని తెలియజేసింది. కొమిరేపల్లిలో తొలి విడత గిరిజనులకు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ఆశ్రయం సంస్థ అధినేతకు సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీ వరమణి, పార్టీ జిల్లా కార్యదర్శి మెండెం సంతోష్, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి)కు దాత కే.అరుణ్ భవాని కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు

- ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు విడనాడాలి
- గృహసారథుల సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : గ్రామాల్లో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కోర్టును అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆరోపించారు. పెదవేగి మండలం పెదకడిమిలో వలంటీర్లు, గృహసారథులతో సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం జగన్ కార్యక్రమంపై బుధవారం దిశానిర్దేశం చేశారు. మార్చి 18 నుంచి 25 వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గృహసారథులకు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఎవరైనా దాడులకు పాల్పడితే తాట తీస్తామని అబ్బయ్య చౌదరి హెచ్చరించారు. గ్రామంలో రజకులు ఎన్నో ఏళ్లుగా రావుల చెరువుపై ఆధారపడి జీవిస్తుంటే ఆ చెరువు విషయంలో, ఇళ్ల స్థలాల విషయంలో టీడీపీ నేతలు కోర్టుకెళ్లారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చళ్లగొళ్ల భూస్వామి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, కొప్పాక సొసైటీ చైర్మన్ చల్లగొళ్ల భూస్వామి, పెదపాడు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఘంటా శ్రీనివాసరావు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో 10వేల మందికి ఇళ్ల స్థలాలు అందించిన ఘనత అబ్బయ్యచౌదరికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు కొప్పాక సొసైటీ చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు.పెదపాడు మండల వైసీపీ నాయకులు ఘంటా శ్రీనివాసరావు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేసిన సతీష్, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పర్వతనేని నాగయ్య, పర్వతనేని కృష్ణారావు, కొప్పాక, పినకడిమి, భోగాపురం, అంకన్నగూడెం, దుగ్గిరాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.